# కరువొచ్చిందా, దేనికీ?

-పి.వి.బి. శ్రీరామమూర్తి




"కాకి తెగ అరుస్తోంది. నిన్నట్నించే ఎవరు దిగబడతారో పీకలమీదికి?" అంది పాపాయమ్మ వాకిట్లో తీగమీద తడి చీర ఆరేస్తూ. అక్కడే కుర్చీలో కూర్చుని తలకి చిక్కు తీసుకుంటున్న స్వరూప ఓ మూల మంచం మీద అసహ్యంగా దొర్లుతున్న అత్తగారికి వినబడేలా "ఏమో, ఈమెగారికి నిమ్మళంగా లేదనీ, వాళ్ల నాన్నగారు మూడో చెల్లికి ఏకరవు పెట్టరుగా! ఈవిడస్సలు అన్నం తినట్లేదనీ.. రాత్రిళ్లస్సలు నిద్రపోవట్లేదనీ.. మొన్న రాత్రి హడావుడి చేసేసిందనీను. నిన్ననో ఘంట ఆవిడగారు తల్లితో ఫోన్‌లో గోల. ఆవిడ వాళ్ల పెద్దక్కకు.. చిన్నక్కకు ఫోన్లు చేసేసి వెళ్లమని 'డైరెక్షనిచ్చేసుంటుంది. సెలవలొహాటి వరుసగా వచ్చి చస్తున్నాయిగా. ఏ క్షణాన ఎవరు వాల్తారో?" అంది. అనేసి...

"ఏ యూనిట్టే దిగుతుందో, త్రైమాసిక దిగుతుందో, వార్షికే దిగేస్తుందో?" అంది తల్లితో.

"అదేమిటే మీ ఆడపడుచుల పేర్లేమిటే విచిత్రంగా ఉన్నాయ్?"

"నీకు తెలీదు కదూ ఈ సంత! యూనిట్ అంటే మొగుడు పోయిన మా చిన్నాడపడచు. ఆవిడ నెలకోమారొచ్చి కలెక్షన్ చేసుకుపోతుంది. త్రైమాసికంటే మా పెద్దాడపడచు.. ఆవిడకి నెలనెలా రావటానికి కుదర్దు. మూడేసి నెల్లకోసారొచ్చి ఊడ్చుకుపోతుంది. వార్షికంటే మా మూడోది. ఆవిడ పై రాష్ట్రంలో ఉంది. సంవత్సరానికోసారి వస్తుంది. ఆవిడకేం అఖ్ఖర్లేదు గానీ.. ఆవిడ పిల్లల మేతకి మూణ్ణెల్ల గ్రాసం సరిపోతుంది" అంది. జుట్టు ముందుకు విసురుకుని.

"ఏంటే ఈ రోజుల్లోనూ అంతమంది పిల్లల్ని కనేసిందేమిటి?"

"ఆహా! ఆవిడికిద్దరు పిల్లలే. కానీ వాళ్లు బకాసురులు"

అంతా లోపల నుండి వింటోన్న పార్వతమ్మ "ఇంకెన్నాళ్లులేవే నాకూ దగ్గరపడ్డాయి రోజులు. నా గొంతులో పేణం గుటుక్కుమంటే వాళ్లు నీ గుమ్మం తొక్కమన్నా తొక్కరు" అంది దృష్టి తగ్గిన కళ్లరెప్పల్ని చిట్లిస్తూ.

స్వరూప విసిరిన బాణానికి పార్వతమ్మా ఏదో అస్త్రాన్ని సంధించకమానదని స్వరూపకీ తెలుసు. అందుకే బోర్డర్లు గస్తీ కాసిన సైనికునిలా.. కళ్లు, చెవులూ అటే పారేసి, ఆ మాటల్ని కళ్లతోనే కేచ్ చేసి "పాపీ చిరాయుః అని మూడేళ్ల బట్టి చూస్తున్నాం. ఇదే రోగం ఇదే మూలుగు" షార్ట్ పిచ్ బంతులని ఇండియా బేట్స్‌మెన్ తికమకపడతారేమోగానీ స్వరూప తికమకపడదు. అందుకే సిక్స్ కొట్టింది. అయితే దాన్ని గమ్మత్తుగా అప్పుడే గుమ్మంలో అడుగుపెట్టిన భర్త భాస్కరం కేచ్ పట్టేశాడు. "ఎందుకే దాన్నాడిపోసుకుంటావ్? వారం రోజులయి అది కాఫీ, గ్లూకోజ్ తప్ప పట్టెడు మెతుకులు నోటపెట్టలేదు. దాన్నాడిపోసుకోపోతే నీకు రోజులు గడవదా?" అన్నాడు కోపంగా.

"నేనేమన్నానని అంత పౌరుషం తన్నుకొచ్చేసిందీ? ఆవిడన్నం తినప్పోతేనేం? ఆ మందులకే భోయినాలకయినంత ఖర్చు అవుతోంది!"

"అవును ఈ జేబులోంచి కట్టలు తీసే ఖర్చు పెట్టేస్తున్నావ్? దాని పెన్షన్ డబ్బుల్తో అది సర్దుకుంటుందే గానీ నోరిడిచి దమ్మిడీ అడగదు. అందర్లా ఊడ్చుకుని దోచేయాలని తాపత్రయం దానికి లేదు" బౌన్సరు విసిరాడు.

"అంటే, మా అమ్మ వెళ్లేటప్పుడు బస్ చార్జీలు అడుగుతుందనేగా నీ విసుర్లు. మీ అమ్మకి లాగా మా అమ్మకీ అయిదువేలు పెన్షనిస్తే ముష్టి చార్జీలకు మిమ్మల్ని దేబిరించేది కాదు" అంది మూతి మూడంగుళాలు విసుర్తూ.

అంతలోనే-

గుమ్మం ముందు ఆటో ఆగింది. అందులోంచి సూట్‌కేసులతో మూడో ఆడపడుచు, పిల్లలు... ఆటోకి డబ్బులిచ్చేసి

"ఏం అన్నయ్యా! ఏంటి వదినా! ఏమందత్తయ్యగారూ! బాన్నారా?" అంది.

"ఇప్పుడే అనుకుంటున్నాం తల్లీ. కాకి తెగ అరిచి ఛస్తోంటే ఎవరు దిగబడతారోనని అనేసి, అయిన వాళ్లయితే పర్వాలేదు. ముక్కూ, మొహం పరిచయం లేని వాళ్ల మధ్య వచ్చి తిష్ట వేసేస్తున్నార్లే" మాట మార్చింది.

"నేనన్నా. వస్తే వాళ్ల మూడో చెల్లి రావచ్చని. మొన్ననే వాళ్లమ్మ ఆవిడకివన్నీ చెప్పకండీ అంటే వసంతా, మీ అన్నయ్య వింటేనా? అయినా మూడు ముళ్లూ వేసేరేగానీ మూడు మాటలయినా వినరు నావి. ఇక మీ అమ్మ సంగతా! ముగ్గురు కూతుళ్లూ మంచం చుట్టూ కూచుంటే పఠాన్ రైటర్లా ఉంటారు. మీరు కనిపించకనే ఆవిడకనారోగ్యం!" అంది.

"అత్తయ్యగార్లా కాలూ చెయ్యా తిన్నగా ఉంటే అమ్మా మా దగ్గరకే వచ్చేస్తుండేది" అంది వసంత.

"గత జన్మలో చేసిన పాపాలమ్మా అవీ. ఇప్పుడు చూపెడతాయి" అంది పాపాయమ్మ.

"పోన్లెండి. చూస్తున్నవాళ్లు ఈ జన్మలో జాగర్తగా ఉంటే సరి" లోనించి తారాజువ్వ విసిరింది అత్తగారు.

పరిస్థితి ఉద్రిక్తతను నివారించటానికి ప్రయత్నించిన భాస్కరం "అమ్మా! ప్రయాణం బాగా జరిగిందా? బావగారు రాలేదేం?" అన్నాడు. పరిస్థితి విషమిస్తున్నట్లు గమనించిన వసంత అన్నయ్యకు జవాబిచ్చింది. ఉత్తరాది ఆనవాయితీగా వసంతా, పిల్లలూ అన్నా వదినలకూ, అత్తగారికి దండం పెట్టారు పాదాలకి.

"నాకెందుకమ్మా పాపిష్టిదాన్ని" అంది.

'పేరు సరిపోయింది' అనాలనుకున్న భాస్కరం అనలేదు.

"ఇంక మీ అమ్మగారు లేచి డాన్స్ చేసేస్తారు" అంది స్వరూప.

"అంత దురాశ నాకు లేదు. ఇంతకంటే దిగజారకుండా గుటుక్కుమంటే అంతే చాలు" అంది అత్తగారు లోపల్నించి.

వసంత వచ్చిన రెండు రోజుల్లో చారూ, వేపుడు తప్పించి మరో వంట చెయ్యలేదు స్వరూప. భర్తకు చెప్పకుండా అర్థశేరు పాలు తగ్గించేసింది.

పనిపిల్లని పిలిచి "ఏమే, ఆ మధ్య ఊరికెళ్లి ఛస్తానన్నావ్. ఆవిడ కూతురొచ్చింది . ఆవిడ పనులావిడ చేసుకుంటుంది. నువ్వీ వారం రోజులెక్కడకి తగలడతావో తగలడిరా!" అనటం వసంత వింది.

"అదేటమ్మా! ఇంటికి సుట్టాలొచ్చినపుడెల్లమంతారు. ఆయమ్మ సెయ్యి పెద్దది అయమ్మట్టినే సేయించుకోదు. ఎల్లినపుడు అయిదొందలయినా ఇత్తాది. ఆట్నినేనొగ్గుకోను" అని విసురుగా వెళ్లిపోయింది.

* * *

వారం రోజుల తరువాత దెబ్బయ్యేళ్లు పైబడిన ఓ పూర్వ సువాసిని ఏభయ్యో పడిలో ఉన్న దేహదారుఢ్యంతో ఓ పెద్ద చక్రాల బేగ్ తీసుకుంటూ...

"పార్వతమ్మగారిల్లు ఇదేనా?" అంటూ వచ్చింది.

"ఎవరూ, శేషుపిన్నివి కదూ?" అంది వసంత.

"ఓహో వసంతా, నువ్వటే, నువ్వెప్పుడొచ్చావే? హమ్మయ్య. ఇదిగోరా అబ్బాయ్!" అని డబ్బులు తీసిస్తే "చిల్లర్లేదమ్మా" అనడిగాడు.

"పట్టుకుపోరా వెధవా. ఫో" అంది ఆ రిక్షావాడిని.

వాడు ఏభై నోటు కళ్లకద్దుకుని "తొలీత మంచి బోణీయేనమ్మా" అని ఆమె కాళ్లకి దణ్ణం పెట్టి ఆనందంతో మరోసారి చేతులు జోడించాడు.

"ఇల్లు కనుక్కోగలనా లేదాని చచ్చానే. పాపం డొక్కు పీనుగ. విసుక్కోకుండా ఇల్లిల్లూ కనుక్కోని ఈడ్చుకొచ్చాడు వెధవ బాధ. నాకు తొక్కడం రాదు. లేపోతే నువ్వు కూచోరా. నేను తొక్కుతానూ అందామనుకున్నాను" అన్న శేషమ్మ మాటలకు అందరూ నవ్వారు పగలబడి.

"ఈవిడెవరు?" అంది పాపాయమ్మని చూసి.

వెంటనే పాపాయమ్మ "ఆ ప్రశ్న నేనడగాలి!" అనేందుకు అవకాశం ఇవ్వని శేషమ్మ "నేనూ పార్వతమ్మా చిన్నాన్న పెదనాన్న పిల్లలం. నా కంటే ఇది నలభై రోజులు పెద్ద" అంది.

"ఆవిడ అన్నయ్య అత్తగారు పేరు పాపాయమ్మ"

"సంతోషం. మిమ్మల్ని చూసినందుకు. అమ్మని చూసి పాతిక సంవత్సరాలయింది. ఈమధ్యనే మా ఊరెళ్తే ఎవరో చెప్పారు. పార్వతమ్మకి అన్నీ మంచం మీదేనని. ఏభై మందికి ఎడం చేత్తో వండి వడ్డించే ఆ అన్నపూర్ణకి అన్ని కష్టాలా?" అని పాపాయమ్మతో మొదట, ఆ తరువాత వసంతతోనూ మాట్లాడి పార్వతమ్మని వాటేసుకుంది. ఓ చిన్న బేగ్‌తో పళ్లు, స్వీట్లూ తీసి మంచం మీద పెట్టింది.

"ఎందుకే ఇవన్నీ"

"ఎందుకేవిటే? ఇంటికొస్తే ఉత్త చేతుల్తో వెళ్లనిచ్చే దానివా? నువ్వు తినేస్తావని కాదు. పిల్లలు తినరూ? వట్టి చేతులతో వచ్చేసిందేవిటి అని అనుకోరూ? అనుకోవటం మన రోజుల్లో. ఇప్పుడు పిల్లలు మొహం మీదే అనేస్తారు" అనేసి.

"ఏంటీ, ఇలా అయిపోయావ్? డాక్టర్‌కి చూపెట్టుకున్నావా?"


"అయ్యో, నయం! ఆవిడ కోసం ఎన్ని వేలు ఖర్చవుతున్నాయోనట. కొన్ని జీవాలు వాళ్లు సుహపడరూ. ఇంకొహళ్లని సుహపడనివ్వరూ" అంది పాపాయమ్మ.

"అది ఖర్మ"

"నేనూ అదే అంటే ఆవిడ నా మీద ఖస్సుమంది. ఇప్పుడు మీరన్నారు సరిపోయింది"

"సరే. మీరు కాసేపాగండి. మీ పని చూసుకోండి. మేం కష్టసుఖాలు మాటాడుకోవాలి. ఇవాళ ఆమె. రేపు మనం" అంది కఠినంగా.

"మాటాడుకోండమ్మా" అని



మూడు గజాల దూరం వెళ్లి టీవీ ముందు చతికిలబడింది. చతికిలబడిందే గానీ ఆవిడ చెవుల్ని వీళ్ల వేపే వేలాడేసింది.

"ఆ... శేషూ. పోనీలేవే. ఏదో వెతుక్కుంటూ వచ్చావ్. ఎక్కడుంటున్నావే ఎలా గడుస్తోంది జీవితం!" అంది.

"నీకు తెలుసు కదా, ఇరవై ఏళ్లకే ఆయన పోయారు. నాన్న మళ్లీ చేస్తానన్నారు. నేను వద్దన్నాను. నా విచారంతో ఆయన కాలం చేశారు. అన్నయ్యలు వచ్చేయమన్నారు. వదినలు దేవతలు. కానీ నాకెవరి మీదా ఆధారపడి బతకాలనిపించలేదు. నీకు తెలుసు కదా, నాన్న మంచి భాగవతారని చిన్నప్పట్నించీ నాకు కీర్తనలూ, అవీ వచ్చు. కొంత సంగీతజ్ఞానం ఉంది. అమరాంధ్రాలు చదూకున్నాను. జరిగిపోయిందానికేడుస్తూ కూర్చుంటే బ్రతుకంతా ఏడుపే. మనతో పాటు అవతలోళ్లూ ఏడవాలి. అది నాకిష్టం లేదు. కష్టపడి బతకాలనుకున్నాను. ప్రయత్నిస్తే బతకటానికెన్నో దార్లు. భగవద్గీత చదూకున్నాను. అంతో కొంతో అర్థం తెలుసు. పెద్దోళ్లు ఉపన్యాసాలు విన్నాను. రామాలయంలో ధైర్యం చేసి మాట్లాడితే పెద్దలు మెచ్చుకున్నారే. ఇప్పుడు ఎక్కడెక్కడి వాళ్లో పిలుస్తారు. నాకు తోచింది చెప్తా. ఊళ్లో పిల్లలకు శ్లోకాలు, పద్యాలూ చెప్తాను. తిరుపతి దేవస్థానం వాళ్లు పిలిస్తే మాట్లాడతాను. అలాగా కానీ పరకా వస్తుంది. ఇస్తే పుచ్చుకుంటాను. నేను కాదన్ను. అన్నయ్యలు రెండెకరాల మాగాణి బతికున్నన్నాళ్లు అనుభవించమని రాశారు. రైతు ధాన్యం ఆడించి కావల్సిన బియ్యం పండిస్తాడు. అత్తగార్నించీ వాటా వచ్చింది. వాళ్లే ఇచ్చారు. "నీ తదనంతరం నీకెవరికి కావాలంటే వాళ్లకి రాస్కోమన్నారు. చెప్పొచ్చేదేమంటే నా బతుక్కి ఢోకా లేదే!" అనేసి-

"ఉండవే. స్నానం చేసొస్తా. తీరిగ్గా మాటాడుకుందాం" అని.

"అవన్మాయ్ఁ. కాస్త కాఫీ చుక్కుంటే పోసెయ్ తల్లీ" అంది.

భాస్కరం కూర్చుని కబుర్లు చెప్పి వెళ్లాడు పనుందని.

స్వరూప కాఫీ ఇస్తే తాగేసి స్నానానికెళ్లింది.

"ఒంటి గంటయింది. భోయినాలు చేస్తారా?" అంది స్వరూప.

"అన్నం పరబ్రహ్మ స్వరూపం. పెట్టియ్యమ్మా. వచ్చేస్తున్నా" అంది స్వరూప విస్తరాకేసింది.

"కూరలు ధరలు మండిపోతున్నాయి. పప్పులు కొనలేక తోటకూర పిడప. తోటకూర పులుసూ చేశా!" అంది.

"ఏదో సామెత చెప్పినట్లుంది. ఒకటి రెండూ, రెండు ఒకటీనా ఏంటే సరూపా! కథ తెలిసా? ఓకే కూర రెండు రకాలుగా చేసి, రెండు పూటల భోజనం వేళ మార్చి పెట్టిందంటూ ఇల్లాలు. ఆ బౌమ్మడు కడుపు మాడి చచ్చాడు" అనేసి, "ఒసే సరూపా! ఏది పెట్టావని కాదు, ఎలా పెట్టావనేది ముఖ్యం. వెనకటికో రాజు చెప్పాపెట్టకుండా ఓ పేదరాలింటికి ఆకలితో బోయినానికొచ్చాట్ట. ఇంట్లో ఏం లేవాయె. చింతపండు, పచ్చిమిరపకాయలూ, ఉప్పూ ఉన్నాయి. అన్నం ఉడకేసింది. ఇంటి వెనుక గడ్డిమాత్రం దట్టంగా బలిసి ఉంది. సుబ్బరంగా కోసి, కడిగి, చక్కగా పచ్చడి చేసి పెడితే ఆ మారాజు ఆకలితో ఉన్నాడేమో ఆహా ఓహో అంటూ తినేశాట్ట! అమ్మా! ఏంటి పచ్చడి?" అనడిగాట్ట. చివర్న ఆమె మారిపోతూ తన పేదరికానికి ఏడుస్తూ నిజం చెప్పేసిందట. రాజు మెచ్చి ఆ గ్రామాన్ని ఆవిడ పేర్న రాయించాడట. అదీ 'గడ్డవరం'గా మారిందంటారు" అంది.

వసంత కొడుక్కి ముద్దకందిపప్పు లేకపోతే అన్నం గొంతు దిగదు. రోజూ ఏడుపే. వసంతే బజారుకెళ్లి తేవాలనుకుంటే అన్నయ్యకు తెలిస్తే బాధపడతాడని వెళ్లటం లేదు. ఆ రోజు వాడన్నం తిన్నని మారాం.

"రెండు తగల్నియ్యమ్మా వాడే తింటాడు. కరువు మండిపోతుంటే కందిపప్పు ఎక్కణ్ణుంచి తెస్తుంది? అమ్మ, వసంతా అన్నానని కోపం తెచ్చుకోగ్గానీ పిల్లలకు సర్దుకుపోవటం నేర్పాలి! కందిపప్పు వంద రూపాయలు కేజీ" అంది పాపాయమ్మ.

శేషమ్మ పాపాయమ్మ వేపు ఎర్రగా చూసింది.

"వదినగారూ! కరువు కందిపప్పుకొస్తే పర్వాలేదు అభిమానానికీ ఆప్యాయతలకీ రాకూడదు. మీ ఇంటికి తిండి లేక ఎవరూ రారు. అలాగ వచ్చిన వాళ్లకి అప్పు చేసైనా పెట్టమని చెపుతోంది మన సంస్కృతి" అని. కొడుకు వీపు మీద దబ్బుదబ్బుమని బాదుతోన్న వసంత నుండి పిల్లాణ్ని లాక్కుని "వాణ్నెందుకే కొడతావ్? నీకు బుద్ధి ఉందాసలు" అనేసి పిల్లాణ్ని తీసుకుని "ఈ పూటకి తినీ నాన్న రేపుకందిపప్పుతో, నెయ్యితో కమ్మగా తిందువుగానీ" అనేసి "ఏమ్మా! స్వరూపా! నలభై వేలు తెచ్చుకున్న నీ మగడింట్లో కేజీ కందిపప్పు వంద రూపాయలని కొనుక్కోపోవటం బాగోలేదే?" అంది.

స్వరూప మాటాడలేదు.

* * *

నాలుగింటికల్లా బజారుకెళ్లిన శేషమ్మ ఏడయినా రాలేదు. ఈలోగా ఎవరో ఒకామె ఇల్లు వెతుక్కుంటూ వచ్చింది. ఆమె కొడుక్కి శేషమ్మే ఫీజులు కట్టి చదివించిందట. ఇప్పుడింజినీరుగా ఈ పట్టణంలోనే చేస్తున్నాట్ట. ఆమెకెలా తెలిసిందో మరి. శేషమ్మని చూడ్డానికొచ్చింది బుట్టెడు పళ్లతో. వచ్చిం దగ్గర్నించీ శేషమ్మ గొప్పలే, ఆవిడ దాన ధర్మాల గురించే చెప్తుంటే తల్లీ కూతుళ్లు సహించలేకపోతున్నారు. పార్వతమ్మా, వసంతా మాత్రం ఏదో "డొక్కా సీతమ్మ" కథను చెపుతున్నట్టు వింటున్నారు.

ఎనిమిదయ్యేసరికి శేషమ్మా పిల్లలూ వచ్చారు. పిల్లలు వస్తూనే "అమ్మా! నాయినమ్మ కొన్నాది" అని బొమ్మలూ, బట్టలూ చూపించారు స్వరూప పిల్లలు. అన్నీ ఖరీదైనవే. స్వరూప ముఖం మాడిపోయింది. వసంత పిల్లలూ తల్లికి చూపెట్టారు వాళ్ల బొమ్మల్నీ, బట్టల్నీ.

"నేనమ్మా, శేషమ్మ తల్లీ. పైడమ్మని. బాబిక్కడే పనిచేస్తండు. నువ్వు పెట్టిం దీపమే" అని కాళ్లకి మొక్కింది.

"నా మొహం. నాలో ఏముందే. అంతా ఆ పరాత్పరుని దయ" అనేలోగా, రిక్షావాడు "సామాన్లు తెచ్చి ఎక్కడ పెట్టమంటారమ్మా" అన్నాడు.

"అలా లోపల పెట్టురా బాబూ! అమ్మా, స్వరూపా లోపల పెట్టించమ్మా!" అంది.

"ఇవన్నీ ఎందుకండీ. ఆయనకి తీరిక లేక తేలేదు. తెలిస్తే నన్ను తిట్టిపోస్తారు" అంది స్వరూప.

"వాడిన్నే తిడతాను. వాడు నాకొడుకే. నాకా సొతంత్రం ఉంది" రిక్షావాడికి డబ్బులిచ్చి పంపింది.

శేషమ్మా, పైడమ్మా కబుర్లు పాపాయమ్మ చెవులకు ములుకుల్లా తగుల్తున్నాయి. స్వరూప మనసు మాత్రం సుడిగాలికి చెత్తంతా కొట్టుకుపోయినట్లు అయిపోయింది.

★



## ఇలియానా డైటింగ్!

గోవా సుందరి ఇలియానా టాలీవుడ్ లోకొచ్చిన ఆరంభంలో మరీ సన్నగా, నాజూగ్గా వుండడం వల్ల ఓ కొత్తదనంతో ప్రేక్షకుల్ని ఇట్టే ఆకట్టుకుంది. అయితే మరీ బక్క పల్చగా వున్నా బాగోదని భావించి ఇటీవల కాస్త.. కాస్తంటే లావైంది. అయితే ఇలా ఇలియానా లావు కావడం వల్ల ఆమె గ్లామర్‌కి నష్టం కలిగించిందే తప్ప లాభం లేదని కొంతమంది వ్యాఖ్యానించడంతో ఇప్పుడామె తిరిగి సన్నబడేందుకు డైటింగులు మొదలెట్టిందని సినీజనాలు గుసగుసలాడుకుంటున్నారు. అయినా చోద్యం కాకపోతే- ఇలియానా అంతలావుగా వుందా ఇప్పుడు?